# మహంకాళి నృత్యం

దుష్టశిక్షణకారిణి కాళికాదేవి. రూపం భయంకరంగా ఉంటుంది. అటువంటి భయంకర రూపిణికి నృత్యం, డప్పు వాద్యాల మీదచేస్తే బాగుంటుంది అనే ఆలోచనతో ఈ కాళికాదేవి నృత్యాన్ని రూపకల్పన చేయటం జరిగింది. పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం ప్రక్కనగల జగన్నాధపురం గ్రామానికి చెందిన శ్రీ జక్కం ధనరాజు కుటుంబం తాతలనాటి నుండి డప్పు వాద్యకళాకారులు. శ్రీ ధనరాజు కూడా డప్పు వాద్యకళాకారుడు. డప్పు వాద్యానికి జోడించి శ్రీ ధనరాజు 10 సంవత్సరాల క్రితం కాళికాదేవి నృత్యాన్ని రూపకల్పనచేయటం జరిగింది. క్రమేపి ప్రదర్శనలనిచ్చుకుంటూ, నృత్యాన్ని యింకా మెరుగుపరచుకుంటూ యిప్పుడు సదరు నృత్యాన్ని ఒక క్రమపద్ధతిలో ప్రదర్శించుటజరుగుతోంది.

**ఈ నృత్యం లో :**



కాళీమాత - 1, నర్తకులు - 4, ఫకీరు -1, డప్పులు - 5 మొత్తం 11 మంది కళాకారులతో ఈ నృత్యం భక్తి, భయానక భావాలతో కొనసాగుతోంది.

ఈ నృత్యంలో ప్రత్యేకత కాళికాదేవి వేషధారి ముఖంపై మాస్క్ పెట్టుకొనక ఒక పొడుగాంటి ఎర్రనాలుకను మాత్రమే పెట్టుకొని నృత్యంచేయుట, హారతికర్పూరాన్ని అరచేతిలో వెలిగించుకొని ఆ మండుతున్న హారతిని నోట్లోవేసుకొనే సన్నివేశం ప్రేక్షకులను గగుర్పాటు కలుగచేస్తుంది. తనపై యుద్ధానికి వచ్చిన ఫకీరును కాళికాదేవి జయించి ఫకీరును కాళ్లక్రిందపెట్టి త్రొక్కుట దుష్ట శిక్షణను కళ్లకుకట్టినట్లుగా ప్రదర్శించుట జరుగుతోంది.

నలుగురు నర్తకీమణులు తమ అలుపెరుగని నృత్యంలో ప్రేక్షకులను అలరిస్తారు. విశేషమేమనగా వారు స్త్రీలు కాదు, పురుషులే స్త్రీవేషములు ధరించినారనితెలిసినప్పడు ప్రేక్షకులు ఆశ్చర్యపోకతప్పదు. 5 మంది డప్పు వాద్య కళాకారులు నృత్యం మొదటి నుండి చివరివరకు అలుపెరుగక లయబద్ధంగా వాయించుట ప్రశంసనీయం. అమ్మవారి జాతర్లకు, ఊరేగింపులకు, గణపతి ఉత్సవాలప్పడు వీరిప్రదర్శనను గ్రామాలలో ఏర్పాటుచేయుట జరుగుతోంది.

ఈ కళాకారులకు వేరే వృత్తిలేదు, చెయ్యరు. వీరు ప్రదర్శనలు ఉన్నప్పడు ప్రదర్శించుట లేనప్పడు తమ నృత్యాన్ని మెరుగుపరచుకొనుట చేస్తున్నారు.